క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో 'స్పందన'

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలిపి పరిష్కారాలు పొందాలని వారు సూచించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పద్మావతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కడపకు చెందిన పడుకోట పద్మావతి నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పట్నం ఎరుకలప్ప, దుర్గం దస్తగిరిలు కూడా ఎన్నికయ్యారు. ఈ మేరకు వారు నియామక పత్రాలు అందుకున్నారు.

డీహెచ్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక


బందెల ఓబయ్య
అధ్యక్షుడు


మునెయ్య
కార్యదర్శి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళిత గిరిజన హక్కుల పోరాట సమితి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో జరిగిన డీహెచ్‌పీఎస్ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా బందెల ఓబయ్య, కార్యదర్శిగా కానగల మునెయ్యతో పాటు ఆరుగురిని జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, 11 మందిని కార్యవర్గసభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గిడుగు వెంకట రామ్మూర్తికి ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్ : తెలుగుభాషా ప్రేమికుడు గిడుగు వెంకట రామ్మూర్తి 82వ వర్ధంతిని ఆదివారం కడపలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి న్యాయవాది షేక్ అమీన్‌పీరా, రాయల్ కరీం సేవాసమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీఐటీయూ ఆల్ ఇండియా కౌన్సిల్ సభ్యుడిగా బెల్లం మనోహర్



కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీఐటీయూ ఆల్ ఇండియా కౌన్సిల్ సభ్యుడిగా బెల్లం మనోహర్ ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బెంగుళూరు నగరంలో నిర్వహించిన సీఐటీయూ 17వ ఆల్ ఇండియా మహాసభలో ఈమేరకు ఎన్నుకున్నట్లు తెలిపారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మ

చింతకొమ్మదిన్నె : కొత్తపేట- బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను, కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథరెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

చెన్నూరు : ఓబులంపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య నిపుణులు ముండ్ల లక్ష్మీశేఖర్, డాక్టర్ కార్తిక్ నేతృత్వంలో ముండ్ల శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ఓబులంపల్లె పంచాయతీ నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. శిబిరంలో గుండెకు, మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, పంటికి సంబంధించిన వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతోపాటు స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం

కడప నగరంలోని ఎల్ఐసీ సర్కిల్‌లో హౌసింగ్‌బోర్డుకు వెళ్లే మార్గంలో కల్వర్టు దెబ్బతినింది. దెబ్బతిన్నచోట గోతులు ఏర్పడటంతో రాళ్లు, కర్రపుల్లలు అడ్డుగా పెట్టారు. వాటిపై సంచిపట్టలు కప్పి ఉంచారు. ఎవరైనా చూసుకోకుండా వేగంగా వస్తే ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– కడప కార్పొరేషన్


ఎల్ఐసీ సర్కిల్‌లో కల్వర్టు దెబ్బతినడంతో రాళ్లు, కర్రపుల్లలు ఉంచిన దృశ్యం

ఘనంగా ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండివీధిలోని హజరత్ ఇఫ్తికార్‌షావలి, హజరత్ మియాషావలి దర్గా ఉరుసు ఉత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఊరేగింపుగా గంధం కలశాన్ని గురువుల మజార్ వద్ద సమర్పించి విశేష ప్రార్థనలు, ఫాతెహా చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు ప్రసాదాలను అందజేశారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలీ కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు సయ్యద్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులకు అవార్డులు


బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డును అందుకుంటున్న థమన్‌కృష్ణ, హర్షవర్ధన్ నాయక్

కడప ఎడ్యుకేషన్ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం)లోని అటల్ ఇంక్యువేషన్ సెంటర్ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్టార్టప్ జాతర నిర్వహించారు. ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఎంటర్ ప్రెన్యూమర్ షిప్ విభాగాల్లో ప్రాజెక్టుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో 7 వేల స్కూల్స్ నుంచి ప్రాజెక్టుల ప్రదర్శనకు దరఖాస్తులను ఆహ్వానించగా ఇందులో 350 స్కూల్స్‌ను అటల్ టింకరింగ్ ల్యాబ్ వారు ఎంపిక చేశారు. ఇందులో సృజనాత్మకతను ప్రదర్శించిన 10 స్కూల్స్‌ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కడప నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి థమన్‌కృష్ణ, 9వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌నాయక్‌లు కలిసి షీలింగ్ డస్టు క్యాచర్ అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. దీనికి బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు దక్కింది. అలాగే మరో 7వ తరగతి విద్యార్థి హితైన్‌జైన్, 9వ తరగతి విద్యార్థి గురునాగ్ మనోజ్‌లు విజన్ అలర్ట్ అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. దీనికి కూడా బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు లభించింది. దీంతోపాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటర్ ఫణీంద్రభగవాన్‌కు బెస్ట్ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎన్నేబుల్ అవార్డు వచ్చింది. ఇలా నాగార్జున మోడల్ స్కూల్‌కు రెండు బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డుల తోపాటు బెస్ట్ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎన్నేబుల్ అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ అవార్డులను శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్, ఎంకే రెడ్డి, అర్జా స్టీల్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి, హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ చైర్మన్ దీప కృష్ణమూర్తి, అటల్ ఇంకివేషన్ సెంటర్ సీఈఓ శివకిరణ్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులను నాగార్జున మోడల్ స్కూల్స్ కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు అభినందించారు.

మెడికేర్ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప నాగరాజుపేటలోని మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగావైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ మహబూబ్ అలీ వైద్య సేవలందించారు. ఇందులో షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మెడికల్ రెప్‌లు బాబుల్‌రెడ్డి, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, సురేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, ధన, రషీద్, ఆసుపత్రి సిబ్బంది నూర్, గౌతమి, ఆయేషా, యాస్మిన్, అంజానా తదితరులు పాల్గొన్నారు.

క్యూబా సంఘీభావ సభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రపంచ విప్లకారుడు చేగువేరా కుమార్తె అలైదా గువేరా వనువరాలు ప్రొఫెసర్ ఎస్తేఫనియా దేశ పర్యటనలో భాగంగా విజయవాడ వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న క్యూబా సంఘీభావ సభను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆఈదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం నాడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేగువేరా అనేక వీరోచిత పోరాటాలను చేశారన్నారు. నేటి యువత చేగువేరాను రోల్ మోడల్‌గా చూస్తున్నారని అన్నారు. అలాంటి యోధుడి మనవరాలు భారత పర్యటనలో భాగంగా విజయవాడ వస్తున్న సందర్భంగా జరిగే సభకు మేధావులు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

హజ్ హౌస్ గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

చెన్నూరు : హజ్ హౌస్ గురించి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీకి లేదని కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగపు కన్వీనర్ అన్వర్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం హజ్‌హౌస్ నిర్మిస్తామని చెప్పినప్పుడు తామంతా స్వాగతించామన్నారు. ఖిల్లా మసీదుకు చెందిన 14 ఎకరాలు సేకరించారన్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్మించాల్సిన హజ్ హౌస్‌ను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుందన్నారు. దీంతో రూ.25 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. హజ్ హౌస్ నిర్మించేటప్పుడు ఎత్తులో నిర్మించాలనే, కనీస అవగాహన లేకపోవడంతో వర్షాలకు హజ్ హౌస్‌లోకి నీరు చేరుతోందన్నారు. కోవిడ్ సమయంలో కరోనా సెంటర్‌గా ఉన్న హజ్‌హౌస్‌లోకి వర్షపు నీరు చేరడంతో కరోనా బాధితులను తరలించేందుకు అధికారులు, పోలీసులు పడిన అవస్థలు అందరికీ తెలుసన్నారు. టీడీపీ హయాంలో కడప ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకి తరలించినప్పుడు వీరు ఎక్కడ పోయారని ప్రశ్నించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ కరీం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న అన్వర్‌బాషా

గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన


అర్చకత్వ బాధ్యతలను ఆదిమూలం వంశీయులకు అప్పగిస్తున్న చెల్లు వంశీయులు


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్, ఆలయ ఈఓ, పోలీసులు

లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 21, 22న జరిగే గంగమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్‌లు ఆలయ ఈఓ రవీంద్రరాజు, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు.

అంతకుముందు వీరి సమక్షంలో పార్వేట అమావాస్య ముగియడంతో చెల్లు వంశీయులకు ఉన్న అర్చకత్వ బాధ్యతలను ఆదివారం ఆదిమూలం చిన్నప్ప వంశీయులకు అప్పగించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మొక్కులు తీరిన వారు బోనాలు, తలనీలాలు సమర్పించారు. క్యూలైన్‌లో దర్శన ఏర్పాట్లు చేశారు. గంగరాజు, డీఎల్‌డీపీఓ వెంకటసుబ్బయ్య, ఏఎస్ బాలసుబ్రమణ్యం, ఎన్.శివశంకర్ రెడ్డి, హెచ్.శ్రీనివాసులు, టి.రవీంద్ర, ఆరె శివయ్య, గురుస్వామి, వెంకటేష్, ఎ.రామచంద్రయ్య, చుక్కా ప్రసాద్, ఆదిమూలం వేమయ్య, ఎ.రెడ్డి శేఖర్, కొండయ్య, సభాపతి నాయుడు, గంగరాజు, రామమోహన్, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. వేకువ జామున సుప్రభాత సేవ మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు పుష్పాభిషేకం, 102 మంది ఆర్యవైశ్య మహిళలతో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. విశేషంగా అమ్మవారిని వజ్రకిరీటంతో అలంకరించనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు కోరారు.

కనుల పండువగా శివ పార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మైదుకూరు : మైదుకూరులోని అమ్మవారిశాలలో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండవగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆదివారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, గణపతి పూజ నిర్వహించారు. రాత్రి వేద పండితులు శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకట శివప్రసాద్, శ్రీశైలం బోర్డు సభ్యురాలు మాధవిలత దంపతులు సహా ఆర్యవైశ్యులు పాల్గొని మహాదేవుని కల్యాణాన్ని వీక్షించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


జెండాను ఊరేగిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆలీనగర్‌లోని హజరత్ ఖాదర్‌వలీ దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నుంచి జెండాను గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు చేశారు. అనంతరం జెండాను దర్గా వద్దకు చేర్చి అక్కడ స్వామి వారికి చదివింపులు చదివించి వచ్చిన భక్తులకు, ప్రజలకు దర్గా కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు షేక్ అల్లాద్దీన్, డాక్టర్ పఠాన్‌షాహీద్‌ఖాన్, షేక్ మస్తాన్, పఠాన్ అఫ్తాబ్ ఖాన్, షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ అబ్దుల్లాకు ఎంజేఎఫ్ అవార్డు


ఎంజేఎఫ్ అవార్డు అందుకుంటున్న రీజియన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా

రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా ఎంజేఎఫ్ అవార్డు అందుకోవడం గర్వకారణమని రాజంపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వై.సుబ్రమణ్యం రాజు అన్నారు. గుత్తిలో జరిగిన మూడో క్యాబినెట్ సమావేశంలో ఆదివారం లయన్స్ గవర్నర్ చంద్రప్రకాష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు సుబ్రమణ్యంరాజు తెలిపారు. అబ్దుల్లా సేవా కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాజంపేట లయన్స్ క్లబ్ తరపున అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : ఇరుగులమ్మకు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశారు. కొందరు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. మూలపల్లె గ్రామానికి చెందిన పొట్టేటి ఈశ్వర్‌రెడ్డి దంపతులు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారని పూజారి వెంకటరమణ తెలిపారు.

రూటా డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూటా)కు సంబంధించిన డైరీని ఆదివారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రూటా డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్‌హకీమ్ సాహెబ్, రూటా వ్యవస్థాపకుడు హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రూటా సంఘం గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో ఉర్దూ మీడియం విద్యాసంస్థల పరిరక్షణకు, అభివృద్ధికి కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల నుంచి ఉర్దూ విశ్వ విద్యాలయం వరకు ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు డాక్టర్ వశివుల్లా సాహెబ్, సత్తార్‌ఫైజీ, సయ్యద్ సిరాజుద్దీన్, మహమ్మద్ అయూబ్, అఫ్జల్‌బాషా, ఫకృద్దీన్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.


రూటా డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం, రూటా నాయకులు

ఒంటేరు గెలుపునకు కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్ : పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఐకమత్యంతో పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని గెలుపునకు కృషి చేయాలని ఒంటేరు మద్దతుదారుల ఉపాధ్యాయ సంఘాల సయన్వయ వేదిక పిలుపునిచ్చింది. ఆదివారం కడపలోని ఆర్‌జేయూపీ టీచర్స్ హోంలో జరిగిన ఎన్నికల వాల్ స్టిక్కర్స్ ఆవిష్కరణను ఆర్‌జేయూపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్, ఆపస్ నాయకులు సుబ్బరాయుడు, బాలకృష్ణుడు, ఎస్ఎల్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున, ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల వాల్‌స్టిక్కర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక నాయకులు

పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో సంతోషకరం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో సంతోషకరంగా ఉందని పూర్వ విద్యార్థులు నీలి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నిత్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని చలమారెడ్డిపల్లె ఎమ్మెస్సార్ హిల్ వ్యాలీలో 1982–83 సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల తర్వాత ఒకే చోట చదువుకున్న పూర్వ విద్యార్థులు కలవడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమణ, ఇస్మాయిల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బధిరులకు ఆటల పోటీలు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయిలో బధిర మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించారు. బధిర మహిళలు ఎందులోనూ తీసిపోరు అన్నట్లుగా అందరూ ఉత్సాహంగా అన్ని పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎఫ్‌డీడబ్ల్యు మహిళా రాష్ట్రస్థాయి ప్రెసిడెంట్ ధరణి కుమారి, జెలోల్మి కిషోర్, కడప ప్రెసిడెంట్ శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ శ్రీవిద్య, సుధారాణి పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న బధిర సంఘం నాయకులు

కల్లు గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవడం హర్షణీయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని కల్లు గీత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడం హర్షణీయమని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు వైఎస్ఆర్ గీత కార్మిక భరోసా పథకం కింద రూ. 10 లక్షల పరిహారం చెల్లిస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు పులి కృష్ణమూర్తి, నాగరాజు, భద్రయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కళాకారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్మాతిక చింతనను పెంపొందించుకోవాలని బ్రహ్మశ్రీ శ్రీరామ చైతన్య స్వామి పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్లపేటలోని స్వారాజ్య ఆశ్రమంలో 81వ వార్షికోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. ఉపనిషత్తులను ప్రవచించారు. స్వారాజ్య ఆశ్రమ నూతన కమిటీ అధ్యక్షుడుగా వద్ది నరసింహులు వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీరామ చైతన్యస్వామి, ఉపాధ్యక్షులుగా రత్నమ్మ, ఉమాసుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా మచ్చా ప్రభాకర్, కార్యదర్శిగా గుర్రం శివకుమార్, సహాయ కార్యదర్శులుగా శివ, గౌరవాధ్యక్షులుగా శివానందస్వామి, కృష్ణ చైతన్య స్వామి, గౌరవ సలహాదారులుగా అంబటి కృష్ణారెడ్డి, సాధు గోపాలకృష్ణ, సభ్యులుగా రేణుక, జ్యోతి, శ్రీనివాస్, మూలాదేవి, చెంద్రాయుడు, చెన్నా చంద్రబాబులను ఎన్నుకున్నారు. ఆశ్రమాభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.


మాట్లాడుతున్న శ్రీరామ చైతన్య స్వామి

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు నినదించాలి

ప్రొద్దుటూరు : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నినదించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం భావ ప్రకటన స్వేచ్ఛ ఐక్య కార్యాచరణ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నియంతృత్వ విధానాల వల్ల పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. దేశంలో నేడు ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని, కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా భావ ప్రకటనపై ఆంక్షలు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాల అణచివేత విధానాలపై మౌనంగా ఉండటం మూలంగానే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతోందన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి పౌరరుడు నినదించాలని కోరారు. సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత సమాఖ్య అధ్యక్షుడు యల్లయ్య మాదిగ, పౌరవ హక్కుల సంఘం నాయకుడు సురేష్‌బాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధి అమీనా, ఆవాజ్ అధ్యక్షుడు షరీఫ్, బీఎస్పీ అధ్యక్షుడు జయరాం, మిత్రజ్యోతి కార్యదర్శి మహమూద్, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, భారత నాస్తిక సమాజం నాయకుడు జయచంద్రారెడ్డి మాట్లాడారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు